

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 317 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 19, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# సంబురాల పండుగ

# సద్దుల బతుకమ్మ !



## మహిళల ఐక్యతకు అత్యంత విలువనిస్తుంది

మహిళల సంతోషాలను బలపరుస్తుంది

- మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది
- చివరి రోజు జరిగే బతుకమ్మ పండుగ బంగారు పండుగలా సాగుతుంది
- తెలంగాణ ఆడపడుచులు ఆనందంగా జరుపుకునే పండుగ
- బంతిపూలు, తంగేడు పూలు ప్రధాన ఆకర్షణగా పేర్చుకొని బతుకమ్మను సిద్ధపరుస్తున్నారు
- ఆడ, మగ తేడా లేకుండా అందరూ సంతోషంగా ఆస్వాదించే పండుగ
- సద్దుల బతుకమ్మ ఆకర్షణ చూడ చక్కనిదిగా కనిపిస్తుంది.. ప్రభుత్వ కార్యాలయాలు కళకళలాడుతున్నాయి
- చెరువు ప్రాంతాలు బతుకమ్మ పండుగతో వెలుగులు వెదజిమ్ముతున్నాయి
- ఆడపడుచులకు గౌరవంగా స్వాగతం పలుకుతున్న రాజకీయ నాయకులు
- సద్దుల పండుగలో సబ్బండ వర్గాలు పాల్గొంటున్నాయి

డాక్టర్ బరిగెల శివ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సద్దుల బతుకమ్మ పండుగ అద్దం పడుతోంది. ఆటపాటలతో ఆడపడుచులంతా ఒక్కచోట చేరి ఆనందో త్సాహాలతో వేడుకలు జరుపుకుంటున్నారు. బంతి, తంగేడు తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలుపుతున్నారు. కుటుంబ, సామాజిక భేదాలను పక్కనపెట్టి మహిళల ఐక్యతను చాటుతున్నారని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. మహిళల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు పరస్పర స్నేహభావాన్ని బతుకమ్మ బలపరుస్తోందన్నారు. ప్రభుత్వాలు, అధికారులు పండుగ నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు, భద్రత కల్పించాలని సూచించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి సద్దుల బతుకమ్మ ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు. మహిళల సంతోషం, ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణకు ఈ పండుగ చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2





డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.. ముగిసిన నామినేషన్ల గడువు

- చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు
- దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం
- అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్
- అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

5



## వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

- నామినేషన్ల గడువు ముగియడంతో పిటిషన్ నిరర్థకం
- గడువు పొడిగింపు కోరుతూ వైసీపీ హౌస్ మోషన్ పిటిషన్
- ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జోక్యం చేసుకోబోమన్న ధర్మాసనం
- పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు
- మిథున్ రెడ్డితో సహా 70 మందిపై కేసులు నమోదు

5



## గెలిచినా గుర్తింపు ఏదీ?

- విక్టరీ సర్టిఫికెట్ కోసం ఆర్టీసీ జేఏసీ డిమాండ్
- ధ్రువపత్రం జారీలో కార్మిక శాఖ జాప్యం
- ఎన్నికల ప్రక్రియ నుంచే అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణ
- మంత్రి వివేక్ వెంకటస్వామి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని నేతల డిమాండ్

5



## పోలీస్ అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి..

- ప్రతిభకు పోటీల వేదిక!
- వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో వ్యాసరచన, షార్ట్‌ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు..
- విద్యార్థులు, యువత, రచయితలకు ఆహ్వానం

5



# అంబర్‌పేటలో ఇంట్లో వ్యక్తి ఆత్మహత్య

**ఆర్థిక ఇబ్బందులే కారణమై ఉండొచ్చని బంధువుల అనుమానం**



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

అంబర్‌పేటలోని జైస్వాల్ గార్డెన్‌లో ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకున్న స్థితిలో మృతి చెందాడు. పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం, సుద్దెగోనివార్ విజయ్ గౌడ్ (37) తన భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. దసరా పండుగకు మూడు రోజుల ముందు విజయ్ గౌడ్ భార్య, కుమారుడు కరీంనగర్‌లోని స్వగ్రామానికి వెళ్లారు. దీంతో ఆయన ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. అక్టోబర్ 18న ఉదయం నుంచి విజయ్ గౌడ్ ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో, ఆయన భార్య సమాచారం మేరకు బంధువైన సుద్దెగోనివార్ సాయి ప్రసాద్ గౌడ్ (29), ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఈ క్రమంలో బెడ్‌రూమ్‌లోని వెంటిలేటర్ గ్రిల్‌కు చున్నీతో ఉరివేసుకున్న స్థితిలో విజయ్ గౌడ్ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీమ్, అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్ సిబ్బంది ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. గత మూడు నెలలుగా విజయ్ గౌడ్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని, వాటి కారణంగానే ఈ ఘటన జరిగి ఉండవచ్చని ఫిర్యాదుదారుడు అనుమానం వ్యక్తం చేశారు. మృతిపై ఎవరి మీదా అనుమానం లేదని పేర్కొంటూ, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

# దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు

**ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలి-సంపత్ కుమార్**



**పరకాల,18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు.

# మోత్కూరు సబ్ స్టేషన్ లో అద్యుత్ అధికారులు ఆయుధ పూజ : జూనియర్ లైన్మెన్ శ్రీనివాస్



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండలంలో మోత్కూరు గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్లో ఆదివారం రోజు జూనియర్ లైన్మెన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యుత్ ఫీడర్ లకు ఆయుధపూజ నిర్వహించారు. అలాగే ఆదివారం రోజు కొత్త ఫీడర్ను కూడా ప్రాణం దించారు. ఈ సందర్భంగా జూనియర్ లైన్మెన్ శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అందరికీ కండువాలు కప్పి స్వీట్లు పంచారు, ఈ కార్యక్రమానికి ఏఈ ఎండీ హైమద్, ఏడి వెంకట్ నాయుడు. గ్రామ సర్పంచ్ కొత్తపేట ఆనంద్ కుమార్, వికారాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ ధనేశ్వర్, పంతులు కరణం శ్రీకాంత్ రావు, వార్డు సభ్యులు మాణిక్య బాలరాజు, చెన్న కేశవులు, విద్యుత్ సిబ్బంది రాపోలు నర్సింలు, ఆపరేటర్ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంబరాల “పండుగ సద్దుల” బతుకమ్మ

**మహిళల ఐక్యతకు అత్యంత విలువనిస్తుంది**
**మహిళల సంతోషాలను బలపరుస్తుంది**
**మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది**
**చివరి రోజు జరిగే బతుకమ్మ పండుగ బంగారు పండుగలా సాగుతుంది**
**తెలంగాణ ఆడపడుచులు ఆనందంగా జరుపుకునే పండుగ**
**బంతిపూలు, తంగేడు పూలు ప్రధాన ఆకర్షణగా పేర్చుకొని బతుకమ్మను సిద్ధపరుస్తున్నారు**
**ఆడ, మగ తేడా లేకుండా అందరూ సంతోషంగా ఆస్వాదించే పండుగ**
**సద్దుల బతుకమ్మ ఆకర్షణ చూడ చక్కనిదిగా కనిపిస్తుంది**
**ప్రభుత్వ కార్యాలయాలు కళకళలాడుతున్నాయి**
**చెరువు ప్రాంతాలు బతుకమ్మ పండుగతో వెలుగులు వెదజిమ్ముతున్నాయి**
**ఆడపడుచులకు గౌరవంగా స్వాగతం పలుకుతున్న రాజకీయ నాయకులు**
**సద్దుల పండుగలో సబ్బండ వర్గాలు పాల్గొంటున్నాయి**
**డాక్టర్ బరిగెల శివ**



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఊరూరా సద్దుల బతుకమ్మ పండుగను సంబరంగా జరుపుకుంటున్నారని డాక్టర్ బరిగెల శివ సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆడపడుచులు అత్యంత సంతోషంగా జరుపుకునే పండుగలలో సద్దుల బతుకమ్మ పండుగ ఒకటని వివరించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను సబ్బండ వర్గాలు సంతోషంగా జరుపుకుంటున్నాయని పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో ఆటపాటలతో బొడ్డెమ్మను గౌరవపరుస్తూ పరస్పర సంతోషాలతో ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ పండుగ విలువను చాటిచెబుతున్నారని పేర్కొన్నారు. మహిళల కుటుంబ నేపథ్యాలను మొదలుకొని ఘర్షణ వాతావరణాలను రూపుమాపి మహిళలంతా ఐక్యమత్యంతో ఏకత్వాన్ని కనపరుస్తూ సంతోష వాతావరణాన్ని బలపరుస్తున్నారని అభినందించారు. మహిళలు ఏర్పాటు చేసిన బతుకమ్మ సైంటిఫిక్ అద్భుతాలతో సృష్టించబడినట్లుగా ఉంటుందని భావించాల్సి ఉందన్నారు. బతుకమ్మ కోసం సేకరించిన పూలు, మొక్కలు, బతుకమ్మ కూర్పు కోసం సిద్ధపాటు చేయబడిన పూల మొక్కలన్ని సైన్స్ ఆధారంగా కలుషిత నీరును శుభ్రపరిచే విధంగా ఉంటుందని సైన్స్ ఆధారాలు వెల్లడిస్తున్నాయన్నారు. తంగేడు పువ్వు లాంటి మొక్కలు నీటిని శుభ్రపరస్తాయని సైన్స్ పరిజ్ఞానం కలిగిన శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారన్నారు.

**పండుగ ప్రత్యేకతలు..**

మహిళలంటేనె ఎక్కువ సందర్భాలలో తీవ్రమైన మానస ఒత్తిల్లకులోనై ఉంటారన్నది జగమెరిగిన సత్యంలాగా భావించాల్సి ఉంటుండగా సద్దుల బతుకమ్మ పండుగ వాతావరణం ఒక్కసారిగా మహిళల్లోని మానసిక ఒత్తిల్లను పూర్తిగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఇరుగుపొరుగు మహిళలంతా ఏకమై ఐక్యతను కనపరచడంలో సద్దుల బతుకమ్మ పండుగ ఎంతగానో దోహదపడగలదని పేర్కొన్నారు. ప్రధానంగా కుటుంబ నేపథ్యాలను పక్కనపెట్టి, బంధుత్వాలను పక్కనపెట్టి, ఐకమత్యాన్ని చాటుకోవడం కోసం మహిళలంతా ఒక ప్రాంతంలో చేరి బతుకమ్మ సంబరాలను జరుపుకుంటూ తొమ్మిదవ రోజు ఘనంగా పండుగ వాతావరణం ఏర్పాటు చేయడం సద్దుల బతుకమ్మ ప్రత్యేకతను చాటి చెప్పే విధంగా ఉంటుందని తెలిపారు. రాజకీయ మహిళల అయినప్పటికీ, అధికార వ్యవస్థలకు సంబంధించిన అధికార మహిళలలు అయినప్పటికీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు చేస్తున్న మహిళలు అయినప్పటికీ, చదువుకుంటున్న విద్యార్థినీలు అయినప్పటికీ, గృహాలలో గృహినీలుగా ఉంటున్న మహిళలు అయినప్పటికీ, సాధారణ మహిళలు అయినప్పటికీ, గ్రామస్థాయి నుండి మొదలుకొని పట్టణ స్థాయి వరకు చిన్న పెద్ద తారతమ్య భేదం ఏమీ లేకుండా అన్ని ప్రాంతాల మహిళలందరూ ఐకమత్యంతో సద్దుల బతుకమ్మను జరుపుకోవడం మహిళల ఐక్యతను చాటుకునే గొప్ప అవకాశం లాగా భావించాల్సి ఉంటుందన్నారు. వ్యక్తిగత సంతోషాన్ని వేలాదిమంది మహిళలతో కలిసి పంచుకోవడానికి ఒక విధంగా చెప్పాలంటే మహిళలలో యూనిటీని(ఐక్యత) ఏర్పాటు చేస్తుందని అన్నారు. మహిళల మనోభావాలకు మహిళల సంతోషాలకు మహిళల ఐక్యతకు మహిళలను మానసిక ఒత్తిళ్ల నుండి వేరు చేయడానికి ఒక వేదికలాగా సిద్ధపాటు చేయబడే సద్దుల బతుకమ్మ పండుగ తొమ్మిది రోజులపాటు సాధారణ సందడిగా సాగినప్పటికీ తొమ్మిదవ రోజు ఘనంగా నిర్వహించబడుతూ పండుగ వాతావరణంలో మహిళల ఉత్సాహం మహిళల సంతోషం మహిళల ఆనందం పెల్లుబికినట్లుగా కనిపిస్తుందన్నారు. ఆటపాటలతో అలరించే సంస్కృతి సంవత్సరం మొత్తంలో ఒకే ఒక సందర్భంలో కానవస్తుందని అలాంటి పండుగను మహిళలకు అనుగ్రహించిన సద్దుల బతుకమ్మను కేవలం మహిళల ఐక్యతను మహిళల గొప్పతనాన్ని చాటుకోవడానికి మాత్రమే పరిగణలోనికి తీసుకోవాలని అన్నారు. అదే సందర్భంలో దైవత్వాన్ని అనువదింపజేస్తూ మహిళలు ఆడుతున్న నృత్యాలు మహిళలు పాడుతున్న పాటలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రాంతాన్ని ప్రభావితం చేస్తాయన్నది వాస్తవమన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరు సకుటుంబ సమేతంగా సభ్యుల బతుకమ్మ పండుగలో పాల్గొని వాళ్ళ ఆనందాన్ని వ్యక్తపరచడం కేవలం సద్దుల బతుకమ్మకు మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. మహిళా సంక్షేమ రంగాన్ని అత్యంత బలోపేతం చేయడానికి సద్దుల బతుకమ్మ సాహసవంతమైన పండగల అభివర్ణించగలమని తెలిపారు.

**ప్రభుత్వాల ఆత్మగౌరవానికి ప్రతీక..**

తెలుగు వాతావరణాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాలలో కావలసిన సౌకర్యాలను కల్పించడంతోపాటు ఆయా ప్రాంతాలను శుభ్రపరుస్తూ సభ్యుల బతుకమ్మ పండుగలో పాల్గొనే మహిళలను స్వాగతిస్తూ ప్రభుత్వానికి సంబంధించిన ఆహ్వాన స్వాగతం ఫ్లెక్సీలు మహిళలను పండుగలో పాల్గొనే విధంగా ఉత్తేజపరుస్తున్నాయని భావించాల్సి ఉందన్నారు. ఎక్కువ శాతం మహిళా అధికారులు ఇట్టి పండుగలో పాల్గొంటున్నందువల్ల సెక్యూరిటీ ఇబ్బందులు కలగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మహిళలకు మహిళలే స్వయం రక్షకులుగా స్వయం శక్తులుగా స్వయం కార్యక్రమాల నిర్వాహకులుగా సిద్ధపడి పండుగను జరుపుకుంటారని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించబడిన విధానం స్పష్టంగా తెలియజేస్తుంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి అన్ని విధాల సౌకర్యాలు సమకూర్చబడుతూ పండుగ నిర్వహించబడుతున్న సందర్భంలో పోలీసుల పర్యవేక్షణ పోలీసుల సంరక్షణ మహిళలకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తుండగా సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకొని మహిళలు ధరిస్తున్న అత్యంత విలువైన బంగారు ఆభరణాలను సంరక్షించడం కోసం పోలీసులు పదునైన స్థాయిలో బతుకమ్మ సంబరాలు జరుగుతున్న ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా పోలీస్ బందోబస్తు అధిక సంఖ్యలో పెంచి మహిళలకు రక్షణగా నిలుస్తుండడం రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి మహిళల రక్షణను బాధ్యతలాగా స్వీకరించినట్లు కనిపిస్తుందన్నారు. డీజే శబ్దాలకు విపరీతమైన ఆటంకాలు సంభవిస్తున్నాయని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి చోట డీజే శబ్దాలను నిర్మూలించి కేవలం మహిళలు ఆడుతున్న పాటలకు మాత్రమే గౌరవం దక్కే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవడం ఈ సంవత్సరం జరుగుతున్న సద్దుల బతుకమ్మ పండుగలో ప్రత్యేకతను సంతరింప చేసిందని అన్నారు. ఎంతటి పెద్దవాళ్ళైనా సద్దుల బతుకమ్మ పండుగ అనగానే సంబరంగాను ఆనందంగానూ మూడు గంటల పాటు ఒకే ప్రాంతంలో వాళ్ల మనోభావాలను మన మనసులను కేంద్రీకరిస్తూ మహిళలు జరుపుకుంటున్న పండుగలకు సంపూర్ణ మద్దతులను తెలియజేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఐక్యతను బలపరుస్తున్నారని అభినందించారు. మహిళల సంతోషానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ కలకాలం వెలుగొందాలని మహిళల ఆశలు మహిళల ఆకాంక్షలు మహిళల లక్ష్యాలు నెరవేర్చు కోసం జరిగించబడుతున్న సద్దుల బతుకమ్మ పండుగ మహిళలంతా సంతోషాన్ని నింపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామన్నారు.



# గాయాలను బలంగా మార్చుకుని బంధాలను విలువగా కాపాడుకోవాలి

తాళ్లపల్లి సురేష్



**హైద్రాబాద్, అక్టోబర్ 18 (జై భీమ్ న్యూస్)**

జీవిత ప్రయాణంలో ఎదురయ్యే గాయాలు, అవమానాలు, నిరాశలను బలహీనతగా భావించకుండా, వాటి నుంచి విలువైన పాఠాలు నేర్చుకుని మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జై భీమ్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ తెలంగాణ తాళ్లపెల్లి సురేష్ సూచించారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవం మనల్ని కుంగదీయడానికి కాదని, కొన్ని అనుభవాలు మనలో దాగి ఉన్న శక్తిని, ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని వెలికితీసేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. జీవితం ఎప్పుడూ ఒకే విధంగా, సాఫీగా సాగదని సురేష్ తెలిపారు. కొన్ని సందర్భాలు మనకు ఆనందాన్ని, విజయాన్ని అందిస్తే, మరికొన్ని సందర్భాలు బాధను, నిరాశను, అవమానాన్ని కలిగిస్తాయని అన్నారు. మనం ఎంతో నమ్మిన వ్యక్తుల నిర్లక్ష్యం, మనస్ఫూర్తిగా ప్రేమించిన వారి దూరం, మన బలహీనతలను ఆసరాగా చేసుకుని చేసే అవమానాలు మనసుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని చెప్పారు. అయితే అలాంటి సంఘటనలను జీవితాంతం మోస్తూ కుంగిపోవడం కంటే, వాటిని అనుభవాలుగా స్వీకరించి జీవితానికి మార్గదర్శకాలుగా మార్చుకోవాలని సూచించారు. గతంలో ఎదురైన బాధలను పదేపదే గుర్తుచేసుకుంటూ బాధపడితే అవి మన భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు. అదే బాధ నుంచి ఒక పాఠాన్ని నేర్చుకుని, అదే అనుభవాన్ని మన ఎదుగుదలకు ఉపయోగించుకున్నప్పుడు ఆ బాధకు ఒక అర్థం లభిస్తుందని పేర్కొన్నారు. నిన్న మనల్ని ఏడిపించిన సంఘటననే రేపటి మన విజయానికి కారణంగా మార్చుకోగలిగితే అదే జీవితంలో నిజమైన గెలుపు అని తెలిపారు. మన బలహీనతలను చూసి నవ్వేవారు, మన పరిస్థితులను తక్కువ చేసి మాట్లాడేవారు, అవసరం వచ్చినప్పుడు మాత్రమే మన దగ్గరకు వచ్చేవారు సమాజంలో ఉంటారని సురేష్ అన్నారు. అలాంటి వ్యక్తుల ప్రవర్తన ఆధారంగా మన విలువను నిర్ణయించుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరినీ ద్వేషించాల్సిన అవసరం లేదని, అయితే ఎవరికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి, ఎవరిని ఎంతవరకు నమ్మాలి, ఎవరి మాటలకు ఎంత విలువ ఇవ్వాలి అనే విషయాన్ని తెలుసుకోవడం జీవితంలో ఎంతో ముఖ్యమైన జ్ఞానమని తెలిపారు. మనకు అవసరం ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, మనకు ఎలాంటి అవసరం లేని సమయంలో కూడా మన గురించి ఆలోచించే వారే నిజమైన మనవాళ్లని ఆయన అన్నారు. మన విజయాన్ని చూసి అసూయపడకుండా మనకంటే ఎక్కువగా సంతోషించే వారు, మన కష్టాల్లో అండగా నిలిచేవారు, మనం తప్పు చేసినప్పుడు సరిదిద్దేందుకు ప్రయత్నించేవారు, మనం [illegible] చేయూతనిచ్చేవారే నిజమైన బంధాలకు ప్రతిరూపమని పేర్కొన్నారు. ప్రతిరోజూ మనతో మాట్లాడేవారంతా మనవాళ్లు కావాల్సిన అవసరం లేదని, కొంతమంది మనకు దూరంగా ఉన్నప్పటికీ మన మంచిని కోరుకుంటూ మన జీవితంలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంటారని సురేష్ తెలిపారు. దూరం బంధాన్ని నిర్ణయించదని, మనసులో ఉన్న స్థానం, ఆప్యాయత, నమ్మకం, నిజాయితీ బంధాన్ని నిర్ణయిస్తాయని అన్నారు. మనతో ఎంతమంది ఉన్నారన్నదానికంటే, మనం లేని సమయంలో కూడా మన గురించి మంచిగా ఆలోచించేవారు ఎవరో గుర్తించడం ముఖ్యమని సూచించారు. జీవితంలో మనతో కలిసి ప్రయాణించే వ్యక్తులు, పరిచయాలు, పరిస్థితులు కాలానుగుణంగా మారుతూనే ఉంటాయని ఆయన అన్నారు. అయితే కొందరు వ్యక్తులు మాత్రం మన జీవితంలో శాశ్వతమైన ముద్ర వేస్తారని పేర్కొన్నారు. వారు మన పక్కన లేకపోయినా, వారి మాటలు, మంచితనం, ఆప్యాయత, జ్ఞాపకాలు మనకు ఎన్నో సందర్భాల్లో ధైర్యాన్ని ఇస్తాయని తెలిపారు. నిజాయితీగా మనతో ఉన్న బంధాలను నిర్లక్ష్యం చేయకూడదని, మన కోసం నిలబడిన వారిని చిన్నచూపు చూడకూడదని సురేష్ సూచించారు. మన కన్నీళ్లను తుడిచినవారిని, మన కష్టాల్లో తోడుగా నిలిచినవారిని, మన విజయాన్ని మనకంటే ఎక్కువగా ఆనందించినవారిని జీవితంలో ఎప్పటికీ మర్చిపోకూడదని అన్నారు. సంపదను కోల్పోతే తిరిగి సంపాదించవచ్చని, అవకాశాలు చేజారితే మరో అవకాశం రావచ్చని, కానీ మనస్ఫూర్తిగా ప్రేమించిన మనిషిని కోల్పోతే ఆ బంధాన్ని అదే రూపంలో తిరిగి పొందడం చాలా కష్టమని పేర్కొన్నారు. అందుకే బంధాల్లో అహంకారం కంటే ఆప్యాయతకు, అనుమానాల కంటే నమ్మకానికి, కోపం కంటే క్షమకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. చిన్నచిన్న అపార్థాలు, మాటపట్టింపులు, అహంకారాల కారణంగా సంవత్సరాలుగా కొనసాగుతున్న బంధాలను దూరం చేసుకోవద్దని తెలిపారు. మనకు విలువైన వ్యక్తులతో మాట్లాడేందుకు, అపార్థాలను తొలగించేందుకు, అవసరమైనప్పుడు ఒక అడుగు వెనక్కి వేసేందుకు కూడా సిద్ధంగా ఉండాలని అన్నారు. ఇతరులతో మన జీవితాన్ని పోల్చుకోవడం వల్ల అసంతృప్తి, నిరాశ పెరుగుతాయని సురేష్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి పరిస్థితులు, అవకాశాలు, సమయం, పోరాటం వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. ఇతరుల విజయాన్ని చూసి మనం వెనుకబడ్డామని బాధపడకుండా, వారి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మన ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు. ఎదుటివారి జీవితంలోని ఫలితాలను మాత్రమే చూసి మన జీవితంలోని పోరాటాన్ని తక్కువగా అంచనా వేయకూడదని అన్నారు. "నిన్నటి మనతో ఈరోజు మనల్ని పోల్చుకోవాలి.. ఈరోజు మనకంటే రేపటి మనం మెరుగ్గా ఉండేలా ప్రయత్నించాలి" అని సురేష్ సూచించారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి ఓటమి ఒక పాఠంగా, ప్రతి గాయం ఒక అనుభవంగా, ప్రతి అవమానం ఒక ఆత్మవిశ్వాసంగా, దూరమైన వ్యక్తి ఒక జీవిత పాఠంగా, మనతో నిలిచిన వ్యక్తి ఒక వరంగా భావించాలని తెలిపారు. మన జీవితంలో ఎవరు ఎంతకాలం ఉన్నారన్నది మాత్రమే ముఖ్యమేమీ కాదని, వారు మన జీవితంలో ఉన్న సమయంలో మనపై చూపిన ప్రేమ, నమ్మకం, గౌరవం, ఆప్యాయత ఎంత నిజమైనవో గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కష్టకాలంలో మనతో నిలబడిన వారిని సంతోషకాలంలో మర్చిపోవడం కృతజ్ఞత లేకపోవడమే అవుతుందని తెలిపారు. అదేవిధంగా, మనల్ని బాధపెట్టిన ప్రతి వ్యక్తిపై కోపం పెంచుకుంటూ జీవితాన్ని భారంగా మార్చుకోవాల్సిన అవసరం లేదని సురేష్ అన్నారు. కొంతమంది మన జీవితంలో శాశ్వతంగా ఉండేందుకు రారని, మనకు ఏదో ఒక పాఠం నేర్పేందుకు మాత్రమే వస్తారని పేర్కొన్నారు. అందువల్ల దూరమైన ప్రతి బంధాన్ని శాపంగా కాకుండా, జీవితాన్ని అర్థం చేసుకునే ఒక అవకాశంగా చూడాలని సూచించారు. కష్టాలు వచ్చినప్పుడు మన చుట్టూ ఎంతమంది ఉన్నారో తెలుస్తుందని, మనం పడిపోయినప్పుడు చేయూతనిచ్చిన చేతులు, మన కన్నీళ్లను చూసి బాధపడిన హృదయాలు, మన విజయం కోసం నిజాయితీగా ఎదురుచూసిన మనుషులే జీవితంలో అసలైన సంపద అని అన్నారు. అలాంటి వ్యక్తులను పరిస్థితులు మారినా, కాలం గడిచినా మర్చిపోకూడదని సూచించారు. మన విలువను గుర్తించని వ్యక్తుల కోసం మన ఆత్మగౌరవాన్ని కోల్పోకూడదని, అయితే మన తప్పులను గుర్తించి సరిదిద్దుకోవడంలో మాత్రం వెనుకడుగు వేయకూడదని సురేష్ తెలిపారు. ఆత్మగౌరవం, అహంకారం మధ్య తేడాను గుర్తించుకోవాలని, మనసులోని బాధను బలంగా మార్చుకోవాలని అన్నారు. చివరికి మనతో ఎంతమంది ఉన్నారన్నది కాదని, మన కోసం ఎంతమంది నిజంగా ఉన్నారన్నదే జీవితంలో ముఖ్యమని తెలంగాణ తాళ్లపెల్లి సురేష్ పేర్కొన్నారు. గాయాలను మోస్తూ జీవితాన్ని గడపకుండా, వాటి నుంచి బలాన్ని తీసుకుని ముందుకు సాగాలని, నిజమైన బంధాలను హృదయంలో పదిలంగా కాపాడుకోవాలని సూచించారు. "జీవితం మనకు ఇచ్చిన గాయాలే ఒకరోజు మన విజయానికి మెట్లుగా మారాలి. మన విలువను గుర్తించని వారి కోసం కుంగిపోవడం కాదు.. మన విలువను అర్థం చేసుకున్న వారి కోసం ఎదగడమే నిజమైన విజయం" అని తాళ్లపెల్లి సురేష్ పేర్కొన్నారు.

## బుర్ర సురేందర్ గౌడ్ మృతి పట్ల డీసీసీ అధ్యక్షుడు ఇనగాల సంతాపం

మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు పరామర్శ



**హనుమకొండ,18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

నడికూడ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ సోదరుడు బుర్ర సురేందర్ గౌడ్ అకాల మరణం పట్ల హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురేందర్ గౌడ్ మరణవార్త తెలుసుకున్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సురేందర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకుని మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డితో పాటు సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సురేందర్ గౌడ్‌కు నివాళులర్పించారు.

## ఆసుపత్రిలో వీరాటి లింగారెడ్డికి పరామర్శ

ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పెద్ది స్వప్న, ఆకుల శ్రీనివాస్



**హన్మకొండ, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రమాదవశాత్తు గాయపడి అమృత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొమ్మాల దేవస్థానం మాజీ చైర్మన్ వీరాటి లింగారెడ్డిని మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లింగారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

# ట్రెండ్ మోజులో తెలంగాణ సంస్కృతి కనుమరుగు కావొద్దు

## పండుగల అసలు స్ఫూర్తిని కాపాడాలి: బుంగా చాందిని

**హైద్రాబాద్, అక్టోబర్ 18 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ పండుగలు కేవలం వేడుకలు కాదని, అవి మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానాన్ని ప్రతిబింబించే గొప్ప వారసత్వమని టీజేజేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, హైదరాబాద్ సిటీ క్రైమ్ కరస్పాండెంట్ బుంగ చాందిని అన్నారు. కాలానుగుణంగా వస్తున్న మార్పుల పేరుతో పండుగల అసలు స్ఫూర్తి, పవిత్రత దెబ్బతింటుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. 'ట్రెండ్' పేరుతో పండుగలను డీజేలు, సినిమా పాటలు, అసభ్యకర పదజాలం కలిగిన పాటలు, చిల్లర నృత్యాలు, సోషల్ మీడియా రీల్స్‌కు పరిమితం చేయడం వల్ల రాబోయే తరాలకు మన సంస్కృతి పట్ల సరైన అవగాహన లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు తెలంగాణ పండుగలంటే సంప్రదాయాలకు పెద్దపీట వేసేవారని చాందిని గుర్తుచేశారు. బతుకమ్మ పండుగలో మహిళలు సంప్రదాయబద్ధంగా పూలను పేర్చి, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఉయ్యాల పాటలు పాడుతూ ఆనందంగా గడిపేవారని, బోనాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచేవారని తెలిపారు. గణేష్ ఉత్సవాల్లో భజనలు, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కోలాటాలు, బుర్రకథలు, ఒగ్గుకథలు వంటి జానపద కళలకు ప్రాధాన్యం ఉండేదన్నారు. ఈ సంప్రదాయాల ద్వారా వినోదంతో పాటు మన చరిత్ర, సంస్కృతి, ఆచారాలు ఒక తరం నుంచి మరో తరానికి చేరేవని పేర్కొన్నారు. ప్రస్తుతం పండుగల నిర్వహణలో అనవసర ఆర్భాటం పెరుగుతోందని ఆమె అన్నారు. ముఖ్యంగా గణేష్, దుర్గామాత మండపాల వద్ద భక్తి కార్యక్రమాలకు బదులుగా అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసి సినిమా పాటలు, ఐటెం సాంగ్స్, అసభ్యకర భావాలు కలిగించే పాటలు వినిపించడం బాధాకరమన్నారు. కొన్ని ప్రాంతాల్లో మద్యం సేవించి దేవతా విగ్రహాల ఎదుటే చిల్లర నృత్యాలు చేయడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం పండుగల పవిత్రతను ప్రశ్నించేలా చేస్తున్నాయని తెలిపారు. గణపతి జ్ఞానం, వివేకానికి ప్రతీక కాగా, దుర్గామాత శక్తి స్వరూపిణి అని, అలాంటి దేవతల సన్నిధిలో భక్తి, ఆధ్యాత్మికత, సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల్లో భజనలు, హరికథలు, కోలాటాలు, బుర్రకథలు, ఒగ్గుకథలు, జానపద కళా ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించడం ద్వారా యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించవచ్చన్నారు. వినోదాన్ని పూర్తిగా వ్యతిరేకించడం లేదని, అయితే వినోదం పేరుతో సంస్కృతిని, మహిళలను, కుటుంబ విలువలను కించపరిచే విధంగా కార్యక్రమాలు ఉండకూడదని స్పష్టం చేశారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతితో అనుబంధానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలోనూ మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయని చాందిని అన్నారు. బతుకమ్మ చుట్టూ సంప్రదాయ ఉయ్యాల పాటలు పాడుతూ ఆడాల్సిన చోట ఐటెం సాంగ్స్‌కు డ్యాన్సులు చేయడం, పండుగను కేవలం ఫ్యాషన్, ఫోటోలు, వీడియోలు, సోషల్ మీడియా రీల్స్‌కు పరిమితం చేయడం వల్ల దాని అసలు స్ఫూర్తి దెబ్బతింటోందన్నారు. బతుకమ్మను ఆధునికత పేరుతో మార్చడం కంటే దాని వెనుక ఉన్న సంప్రదాయం, ఆధ్యాత్మికత, ప్రకృతి ప్రేమను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "అసలు నష్టం ఎవరికి? మన పిల్లలకే" అని చాందిని పేర్కొన్నారు. పెద్దలు చేసే ప్రతి పనిని పిల్లలు గమనించి అనుసరిస్తారని, దేవుడి మండపం ముందు మద్యం సేవించి నృత్యాలు చేస్తే పండుగ అంటే అదే అనే తప్పుడు భావన పిల్లల్లో ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. పండుగల ఉద్దేశం, వాటి వెనుక ఉన్న కథలు, ఆచారాలు, సంప్రదాయాలను పిల్లలకు వివరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచే మన పండుగల గొప్పతనాన్ని తెలియజేయాలని సూచించారు. బతుకమ్మ ఎందుకు పేర్చుతారు, బోనం ఎందుకు ఎత్తుతారు, వినాయకుడికి గరిక ఎందుకు సమర్పిస్తారు వంటి విషయాలను వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. పండుగ అంటే కొత్త బట్టలు ధరించడం, విందులు చేయడం, డీజేలు పెట్టుకోవడం మాత్రమే కాదని, వాటి వెనుక ఉన్న విలువలు, విశిష్టతను కూడా పిల్లలకు నేర్పించాలన్నారు. తెలంగాణ యాస, భాష మన ప్రత్యేకమైన గుర్తింపు అని చాందిని పేర్కొన్నారు. ఇంట్లో పిల్లలతో సాధ్యమైనంత వరకు తెలంగాణ యాసలోనే మాట్లాడాలని, తెలంగాణ సామెతలు, పొడుపుకథలు, జానపద గేయాలు, స్థానిక పదాలను వారికి పరిచయం చేయాలని కోరారు. "భాష బతికితేనే సంస్కృతి బతుకుతుంది" అని అన్నారు. మన భాషను చిన్నచూపు చూడకుండా గర్వంగా మాట్లాడే వాతావరణాన్ని కుటుంబాల్లోనే కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా మన సంప్రదాయ వృత్తులు, చేతివృత్తులకు గౌరవం కల్పించాలని సూచించారు. పోచంపల్లి చీరలు, చేనేత వస్త్రాలు, స్థానిక కళాకారుల ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతితో పాటు ఎన్నో కుటుంబాల జీవనోపాధికి అండగా నిలవవచ్చన్నారు. పిల్లలకు చేతిపనికి విలువ, కష్టానికి గౌరవం, స్థానిక కళాకారుల పట్ల ఆదరణ కలిగేలా చేయాలని కోరారు.



పండుగను జీవించాలి.. ప్రదర్శించ కూడదు అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలని చాందిని అన్నారు. బతుకమ్మను కేవలం ఫోటోల కోసం పేర్చడం కాకుండా అమ్మ, అవ్వలతో కలిసి సంప్రదాయ పద్ధతిలో పేర్చాలని, పెద్దల నుంచి పాత పాటలు నేర్చుకుని చిన్నతరానికి నేర్పించాలని కోరారు. దేవాలయాలు, మండపాలకు వెళ్లినప్పుడు భక్తితో పూజలు చేయడం, ప్రసాదం పంచుకోవడం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి మంచి సంప్రదాయాలను కొనసాగించాలన్నారు. ఆధునిక సాంకేతికతను, సోషల్ మీడియాను పూర్తిగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదని, వాటిని మన సంస్కృతిని ప్రచారం చేయడానికి ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, తెలంగాణ జానపద కళలు, పండుగల చరిత్ర, స్థానిక ఆచారాలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ద్వారా యువతలో మరింత ఆసక్తి కలిగించవచ్చన్నారు. రీల్స్ చేయాలనుకుంటే కూడా మన సంస్కృతి, కళలు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేయాలని కోరారు. "ట్రెండ్ మారాలంటే మనమే మారాలి. డీజేలను పూర్తిగా ఆపాలని కాదు.. డీజేలో ఎలాంటి పాటలు వినిపించాలి, ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి అనే విషయంలో మనమే బాధ్యత తీసుకోవాలి. పండుగ అనేది మన సంస్కృతిని తర్వాతి తరానికి అందించే అవకాశం. ఆ అవకాశాన్ని కేవలం వినోదానికి పరిమితం చేయకూడదు" అని చాందిని అన్నారు. తల్లిదండ్రులు, యువత, పండుగ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, సాంస్కృతిక సంస్థలు కలిసి పండుగల నిర్వహణపై చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు ఆదర్శంగా నిలిచేలా పెద్దలు వ్యవహరించాలని, పండుగల్లో భక్తి, సంస్కృతి, సంప్రదాయం, కుటుంబ విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మన పండుగలకు విగ్రహాలు, విద్యుత్ అలంకరణలు, భారీ సౌండ్ బాక్సులు మాత్రమే మిగిలి, వాటి వెనుక ఉన్న భక్తి, ఆచారం, సంస్కృతి కనుమరుగైతే అది మనందరి వైఫల్యమే అవుతుందని ఆమె హెచ్చరించారు. తెలంగాణ సంస్కృతి కేవలం పుస్తకాల్లో లేదా ఫోటోల్లో కనిపించేది కాదని, అది మన జీవన విధానంలో కనిపించాల్సిన వారసత్వమని అన్నారు. మన పండుగలను మనమే గౌరవించి, మన పిల్లలకు వాటి విలువను నేర్పి, తెలంగాణ సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని బుంగ చాందిని పిలుపునిచ్చారు.

# సైబర్ దాండియా






**సంస్కృతి, సైబర్ అవగాహనల సమ్మేళనం**

**హైదరాబాద్, అక్టోబర్ 18 (జై భీమ్ న్యూస్)**

ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు పోలీస్--ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సైబరాబాద్ పోలీసులు "సైబర్ దాండియా" కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక వేడుకలను ముఖ్యమైన సైబర్ భద్రత సందేశాలతో మేళవిస్తూ ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ డా. యం. రమేష్ నాయకత్వంలో, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ సి ఎస్ సి ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన (సిఎంసీ ) సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్ డీసీపీ సైబర్సైబర్ క్రైమ్స్ శ్రీమతి పుష్ప ఈ కార్యక్రమానికి మార్గనిర్దేశం చేస్తూ సమన్వయం చేశారు. సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఐటీ కంపెనీల ప్రతినిధులు, యువత, మహిళలు, కుటుంబ సభ్యులు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 1500 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సి పి రమేష్ మాట్లాడుతూ.. సాంస్కృతిక వేడుకలతో పాటు సైబర్ భద్రతపై అవగాహనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో "సైబర్ దాండియా" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సైబర్ దాండియా వంటి కార్యక్రమాల ద్వారా పోలీసులు ప్రజలతో నేరుగా మమేకమై, కొత్తగా వెలుగుచూస్తున్న సైబర్ ముప్పులు, వాటి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించవచ్చన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ ఐ ), డిజిటల్ టూల్స్, వీడియోలు, ప్రాక్టికల్ డెమాన్‌స్ట్రేషన్లను వినియోగించినట్లు తెలిపారు. వివిధ రకాల సైబర్ నేరాలు, నేరగాళ్లు అనుసరిస్తున్న విధానాలు (మోడస్ ఆపరేండి ), వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సరళంగా, ఆసక్తికరంగా, సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. సాంకేతికతతో రోజువారీ జీవితం సులభతరమైనప్పటికీ, సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసేందుకు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నారని సీపీ తెలిపారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మరియు ట్రేడింగ్ మోసాలు, ఫిషింగ్, స్మిషింగ్, ఓటీపీ మోసాలు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ లు, పాస్‌వర్డ్‌లు, పిన్ లు లేదా బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సీపీ సూచించారు. ముఖ్యంగా అసాధారణంగా అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ పెట్టుబడి ఆఫర్లను నమ్మేముందు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలన్నారు. సైబర్ మోసానికి గురైన సందర్భంలో బాధితులు వెంటనే స్పందించి 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ శ్రీమతి పుష్ప మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ప్రజల్లోని భయం, అత్యాశ, నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, వీడియో కాల్స్, అనుమానాస్పద ఎపిక్ ఫైల్స్, లింకులు, నకిలీ పెట్టుబడి పథకాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగ ఆఫర్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "క్లిక్ చేసే ముందు ఆలోచించండి -- నమ్మే ముందు ధృవీకరించండి" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆమె సూచించారు. సైబర్ దాండియా వేడుకల్లో యువత, మహిళలు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సాహభరితమైన దాండియా ప్రదర్శనలను సైబర్ భద్రత అవగాహనతో మేళవించడం ద్వారా, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహనను ఆసక్తికరంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో చేరవేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ డా. యం. రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, అన్నపూర్ణ డి సి పి అడ్మిన్, డీసీపీ సైబర్ క్రైమ్స్ శ్రీమతి పుష్ప; డీసీపీ శ్రీమతి లావణ్య; కూకట్‌పల్లి డీసీపీ శ్రీమతి రితిరాజ్, ఐపీఎస్; ట్రాఫిక్- టు డీసీపీ శ్రీమతి ఎస్. శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్; శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీ చ. శ్రీనివాస్, ఐపీఎస్; సి ఎ ర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ శ్రీ పి. సంజీవ్ తదితర ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎస్సీ ఎస్సీ , సి ఎం సి ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఐటీ కంపెనీల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. సుమారు 1500 మంది పాల్గొనడంతో "సైబర్ దాండియా" కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమం ద్వారా "సురక్షితంగా సంబరాలు జరుపుకోండి - సైబర్ ప్రపంచంలో సురక్షితంగా ఉండండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

## పండుగ వేళా.. వీధి దీపాల్లేవా?

**పింగిలి మహిళా కళాశాల సమీపంలో వీధి దీపాలు బంద్**

**అధికారుల నిర్లక్ష్యంపై కాంగ్రెస్ 60వ డివిజన్ అధ్యక్షుడు బుస్సా నవీన్ కుమార్ ఆగ్రహం**

**ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు**

**బతుకమ్మలతో వెళ్తున్న మహిళలకు ఇబ్బందులు**





**హనుమకొండ, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

60వ డివిజన్ పరిధిలోని పింగిలి డిగ్రీ మహిళా కళాశాల సమీపంలో వీధి దీపాలు వెలగకపోవడంపై స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బుస్సా నవీన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై శుక్రవారం లైన్మెన్ సుదర్శన్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని ఆరోపించారు.బతుకమ్మ పండుగ వేళ వీధి దీపాలు లేకపోవడంతో బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని నవీన్ కుమార్ మండిపడ్డారు.ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు ప్రతిపక్ష నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా పనిచేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.కమిషనర్ స్పందించాలి.. పింగిలి డిగ్రీ మహిళా కళాశాల సమీపంలో వీధి దీపాలను తక్షణమే పునరుద్ధరించాలని, ఫిర్యాదు చేసినా స్పందించని అధికారుల తీరుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బల్దియా కమిషనర్‌ను కోరనున్నట్లు బుస్సా నవీన్ కుమార్ తెలిపారు.



## తాత ప్రేమకు నిదర్శనం..

**వీల్‌చైర్‌పై మనవరాలిని బతుకమ్మ వేడుకలకు తీసుకొచ్చిన తాత!**

**మనవరాలి సంతోషం కోసం తపన**

**ఉర్సు రంగలీలా మైదానంలో అందరినీ ఆకట్టుకున్న అపురూప దృశ్యం**



**ఉర్సు రంగలీలా మైదానం, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

బతుకమ్మ వేడుకల్లో ఓ తాత తన మనవరాలిపై చూపిన ప్రేమ అందరినీ ఆకట్టుకుంది. దివ్యాంగురాలైన తన చిన్నారి మనవరాలికి బతుకమ్మ సంబరాలను చూపించాలనే ఆప్యాయతతో ఆమెను వీల్‌చైర్‌పై ఉర్సు రంగలీలా మైదానానికి తీసుకొచ్చాడు.రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను చూసి చిన్నారి ఆనందించగా, బతుకమ్మ పాటలకు చప్పట్లు కొడుతూ వేడుకల్లో భాగమైంది. మనవరాలి సంతోషమే తన ఆనందంగా భావించిన తాత, ఆమెకు బతుకమ్మ సంబరాలను దగ్గరగా చూపిస్తూ మైదానమంతా తిప్పాడు.మనవరాలిపై తాత చూపిన ఆప్యాయత అక్కడి వారిని కదిలించింది. కుటుంబ బంధాల్లోని ప్రేమానురాగాలకు, పిల్లల ఆనందం పట్ల పెద్దలు చూపే శ్రద్ధకు ఈ దృశ్యం నిదర్శనంగా నిలిచింది. బతుకమ్మ వేడుకల్లో ఈ అపురూప క్షణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ప్రొఫెసర్ గాదే సమ్మయ్యకు 'బెస్ట్ సైంటిస్ట్ అవార్డు'

**సైంటిఫిక్ లారెల్స్ సంస్థ నుంచి పురస్కారం**

**పరిశోధన, బోధన రంగాల్లో సేవలకు గుర్తింపు**

**కేయూ క్యాంపస్, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రొఫెసర్ గాదే సమ్మయ్యకు ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ రంగంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా సైంటిఫిక్ లారెల్స్ సంస్థ 'బెస్ట్ సైంటిస్ట్ అవార్డు'ను ప్రదానం చేసింది. ఔషధ పరిశోధన, ఉన్నత విద్య, పరిశోధకులకు మార్గదర్శకత్వం, విద్యా పరిపాలన రంగాల్లో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారం అందించినట్లు సమాచారం.

**పరిశోధనా రంగంలో విశేష కృషి**

ప్రొఫెసర్ గాదే సమ్మయ్య తన విద్యా, పరిశోధనా ప్రస్థానంలో భాగంగా ఇప్పటివరకు 77 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఆయన పరిశోధనా ప్రొఫైల్‌లో ఆరు హెచ్-ఇండెక్స్, 99 సైటేషన్లు నమోదయ్యాయి. అదేవిధంగా నాలుగు పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహించారు. ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ రంగంలో పరిశోధనలు చేపట్టడంతో పాటు విద్యార్థులకు పరిశోధన సంబంధిత అంశాల్లో మార్గదర్శకత్వం అందిస్తున్నారు.

**విద్యార్థులకు మార్గదర్శకత్వం**

పరిశోధకులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించడంలోనూ సమ్మయ్య సేవలందించారు. 2007 నుంచి 2025 వరకు 105 మంది ఎం.ఫార్మసీ విద్యార్థుల పరిశోధనా ప్రాజెక్టులకు మార్గదర్శకత్వం వహించారు. 2007 నుంచి 2026 వరకు ఆయన పర్యవేక్షణలో ఎనిమిది మంది పరిశోధకులు పీహెచ్‌డీ పూర్తి చేశారు. మరో ఐదుగురు పరిశోధకులు ప్రస్తుతం ఆయన పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్నారు.



**విద్యాభ్యాసం నుంచి విశ్వవిద్యాలయ సేవల వరకు**

ప్రొఫెసర్ గాదే సమ్మయ్య కాకతీయ విశ్వవిద్యాలయంలో బి.ఫార్మసీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. బనారస్ విశ్వవిద్యాలయంలో ఎం.ఫార్మసీ అభ్యసించారు. తొలుత ఫార్మాస్యూటికల్స్ రంగంలో మాన్యుఫాక్చరింగ్ కెమిస్ట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించి, అనంతరం తాళ్ల పద్మావతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2003 మార్చిలో కాకతీయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా చేరారు. అనంతరం వివిధ విద్యా, పరిపాలనా బాధ్యతలు నిర్వహించారు. జనవరి 2024 నుంచి జనవరి 2026 వరకు కళాశాల డీన్‌గా పనిచేశారు.

**పలు కీలక పదవుల్లో బాధ్యతలు**

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్, హెడ్‌గా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా సమ్మయ్య వివిధ బాధ్యతలు నిర్వహించారు. విద్యా ప్రణాళికల రూపకల్పన, పాఠ్యాంశాల అభివృద్ధి, పరిశోధనలకు ప్రోత్సాహం, కళాశాల పరిపాలన వంటి అంశాల్లో ఆయన పనిచేశారు.

**విశ్వవిద్యాలయ వర్గాల్లో హర్షం**

ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ రంగంలో ప్రొఫెసర్ గాదే సమ్మయ్య అందించిన సేవలకు 'బెస్ట్ సైంటిస్ట్ అవార్డు' లభించడం ఆయన విద్యా, పరిశోధనా ప్రస్థానంలో గుర్తించదగిన పరిణామం. ఈ పురస్కారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు గౌరవప్రదమైన విషయంగా నిలిచింది.

## ఇంద్రమ్మ కాలనీలో స్టైలిష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

**శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ**

**వరంగల్, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఇంద్రమ్మ కాలనీలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్టైలిష్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీలోని రోడ్ నంబర్ 6 వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావానికి, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకలని తెలిపారు. పవిత్రమైన పండుగ వేళ అన్నదానం చేయడం ద్వారా సేవాభావాన్ని, మానవతా విలువలను చాటుకోవచ్చున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. యువత ఉత్సవాల నిర్వహణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండటం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఐక్యత, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన స్టైలిష్ యూత్ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు ర్యాకల సత్యం, కేతిరి రాజేందర్, బండ కనక సాయిలు, చీకట్ల సంపత్ గౌడ్, బండి దేవేందర్, కక్కెర్ల అశోక్ గౌడ్, జాటోత్ శంకర్ నాయక్‌తో పాటు స్టైలిష్ యూత్ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# హ్యాట్సాఫ్ కలెక్టర్ అమ్మా..

**చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు!**
**సద్దుల బతుకమ్మలో చిన్నారులకు రిస్ట్ బ్యాండ్లు..**
**కలెక్టర్ చొరవపై మహిళల హర్షం**

**వరంగల్, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

సద్దుల బతుకమ్మ వేడుకల్లో చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక చర్యలు చేపట్టడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేడుకల్లో భారీ జనసందోహం కారణంగా పిల్లలు తప్పిపోయే ప్రమాదాన్ని నివారించేందుకు, వారి చేతికి తల్లిదండ్రుల మొబైల్ నంబర్లు నమోదైన రిస్ట్ బ్యాండ్లను అందజేయడం అభినందనీయమని పేర్కొంటున్నారు. చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్‌కు మహిళలు అభినందనలు తెలుపుతూ "కలెక్టర్ మేడమ్‌కు సెల్యూట్" అంటూ ప్రశంసిస్తున్నారు.

**చిన్నారుల భద్రతకు ముందస్తు చర్యలు**

సద్దుల బతుకమ్మ సందర్భంగా వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో చిన్నారుల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారుల సమన్వయంతో పిల్లలకు తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు ఉన్న రిస్ట్ బ్యాండ్లను అందజేస్తున్నారు. పండుగ వేడుకలకు కుటుంబ సమేతంగా వచ్చే ప్రజలకు ఈ ఏర్పాటు భరోసా కల్పిస్తోంది.

**ఉర్సుగుట్ట వద్ద రిస్ట్ బ్యాండ్ల పంపిణీ**

ఖిలా వరంగల్ మండలం ఉర్సుగుట్ట వద్ద నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ చిన్నారులకు రిస్ట్ బ్యాండ్లను అందజేశారు. పిల్లలు జనసందోహంలో తప్పిపోయిన సందర్భంలో వారి చేతికి ఉన్న రిస్ట్ బ్యాండ్‌పై నమోదైన ఫోన్ నంబర్ల ద్వారా తల్లిదండ్రులను సంప్రదించే అవకాశం ఉంటుంది. తద్వారా చిన్నారులను త్వరగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు వీలవుతుంది.

**మహిళల నుంచి ప్రశంసలు**

పండుగల సమయంలో చిన్నారుల భద్రతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల అనుకోని ఘటనలను నివారించేందుకు అవకాశం ఉంటుందని మహిళలు అభిప్రాయపడుతున్నారు. వేడుకలను ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించడంతోపాటు పిల్లల క్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామమని పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చొరవతో పాటు క్షేత్రస్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేస్తున్న అధికారుల చర్యలను మహిళలు అభినందిస్తున్నారు. బతుకమ్మ సంబరాలు ఆనందంగా సాగడంతోపాటు ప్రతి చిన్నారి సురక్షితంగా ఇంటికి చేరేలా ఇటువంటి చర్యలు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# పోలీస్ అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి..

**ప్రతిభకు పోటీల వేదిక!**
**వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో**
**వ్యాసరచన, షార్ట్‌ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు..**
**విద్యార్థులు, యువత, రచయితలకు ఆహ్వానం**

**వరంగల్, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 21 నుంచి 31 వరకు వివిధ పోటీలు నిర్వహించనున్నారు. వ్యాసరచన, షార్ట్‌ఫిల్మ్, ఫోటోగ్రఫీతో పాటు ఆర్టికల్స్, ఫీచర్స్ విభాగాల్లో పోటీలు ఏర్పాటు చేశారు. ప్రతి విభాగంలో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విజేతలకు అవార్డులు అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు.

**వ్యాసరచన పోటీలు**

తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహించే వ్యాసరచన పోటీల్లో 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, డిగ్రీ ఆపై చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు.

**12వ తరగతి వరకు విద్యార్థులకు అంశాలు:**

- నేరాల నివారణలో పోలీసుల, పౌరుల పాత్ర.
- డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలి?

**డిగ్రీ, ఆపై విద్యార్థులకు అంశాలు:**

- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర.
- తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర.

వ్యాసాన్ని 500 పదాలకు మించకుండా కాగితంపై రాసి, ఫొటో తీసి పీడీఎఫ్‌గా మార్చి అక్టోబర్ 24లోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలి.

**షార్ట్‌ఫిల్మ్ పోటీలు**

పోలీస్ అమరవీరుల త్యాగాలు, పోలీసుల విధులు, ప్రతిభ, ప్రజల రక్షణ వంటి అంశాలపై మూడు నిమిషాలకు మించకుండా షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించాలి. ఆసక్తి గల యువత, ఔత్సాహికులు తమ చిత్రాలను పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచి అక్టోబర్ 23వ తేదీ సాయంత్రంలోగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పీఆర్వోకు అందజేయాలి. ఎంపికైన మూడు ఉత్తమ చిత్రాలను రాష్ట్రస్థాయి పోటీలకు డీజీపీ కార్యాలయం, హైదరాబాద్‌కు పంపిస్తారు.

**ఫోటోగ్రఫీ పోటీలు**

పోలీసుల త్యాగాలు, విధులు, ప్రజల రక్షణ తదితర అంశాలపై మూడు ఫొటోలను 10x8 అంగుళాల పరిమాణంలో సమర్పించాలి. అక్టోబర్ 23వ తేదీ సాయంత్రంలోగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పీఆర్వోకు ఫొటోలను అందజేయాలి. ఎంపికైన మూడు ఉత్తమ ఫొటోలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు.

**రచయితలు, పాత్రికేయులకు ఆహ్వానం**

పోలీసుల త్యాగాలు, వృత్తిపరమైన సేవలకు సంబంధించిన వ్యాసాలు, విశేష కథనాలు, ఫీచర్లను రచయితలు, పాత్రికేయుల నుంచి ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన రచనలను అక్టోబర్ 21 నుంచి వారం రోజుల పాటు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ వార్తాపత్రికల్లో ప్రచురించనున్నారు. ఆసక్తి గలవారు తమ రచనలను అక్టోబర్ 19వ తేదీ సాయంత్రంలోగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పీఆర్వోకు అందజేయాలి. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు పోలీసుల సేవలు, ప్రజల భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని వరంగల్ పోలీస్ కమిషనరేట్ వెల్లడించింది.



## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.. ముగిసిన నామినేషన్ల గడువు

**చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు**
**దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం**
**అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్**
**అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది. ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది. నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

# వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

**నామినేషన్ల గడువు ముగియడంతో పిటిషన్ నిరర్థకం**
**గడువు పొడిగింపు కోరుతూ వైసీపీ హౌస్ మోషన్ పిటిషన్**
**ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జోక్యం చేసుకోబోమన్న ధర్మాసనం**
**పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు**
**మిథున్ రెడ్డితో సహా 70 మందిపై కేసులు నమోదు**

**విజయవాడ, జై భీమ్ న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు పొడిగించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నామినేషన్ల స్వీకరణకు నిర్దేశించిన గడువు ఇప్పటికే ముగిసినందున పిటిషన్ నిరర్థకంగా మారిందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత సాధారణంగా జోక్యం చేసుకోబోమని కోర్టు వ్యాఖ్యానించినట్లు సమాచారం. మరోవైపు, నామినేషన్ల తొలిరోజైన శుక్రవారం పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో పాటు సుమారు 70 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి పుంగనూరు పట్టణంలోకి ప్రవేశించకుండా పోలీసులు నోటీసులు జారీ చేసినట్లు కథనంలో పేర్కొన్నారు. అధికార పార్టీ అడ్డంకులు సృష్టిస్తున్నా వెనక్కి తగ్గబోమని, అభ్యర్థుల హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తామని మిథున్ రెడ్డి తెలిపినట్లు సమాచారం.

# గెలిచినా గుర్తింపు ఏదీ?

**విక్టరీ సర్టిఫికెట్ కోసం ఆర్టీసీ జేఏసీ డిమాండ్**
**ధ్రువపత్రం జారీలో కార్మిక శాఖ జాప్యం**
**మంత్రి వివేక్ వెంకటస్వామి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**
**వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని నేతల డిమాండ్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్ :**

టీజీఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన తమకు విక్టరీ సర్టిఫికెట్ జారీ చేయడంలో కార్మిక శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారని టీజీఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలు ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ)లతో కూడిన జేఏసీ కూటమి విజయం సాధించిందని తెలిపారు. ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నా ధ్రువీకరణ పత్రం అందజేయకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే కార్మిక శాఖ అధికారులు తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ, తక్షణమే విక్టరీ సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్.. మహిళా సంఘాలకు భరోసా!

**పెద్దకోరుపోలులో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన**
**నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**





**నెక్కొండ, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నెక్కొండ మండలం పెద్దకోరుపోలు గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, మహిళా సంఘం భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని, విద్యుత్ సమస్యల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు రామానందు, రంజిత్ రెడ్డి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అవుల శ్రీనివాస్, మాదటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బక్కి అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమల్ చవాన్, సొసైటీ డైరెక్టర్ మట్టే వెంకటయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెండే రవీందర్, పదాల రవికుమార్, పదాల రాజ్‌కుమార్, వార్డు సభ్యుడు బాధావత్ క్రాంతి, మాజీ సర్పంచ్ మెండే కుమారస్వామి, పార్టీ ఉపాధ్యక్షుడు గాజుల రాము, మాజీ ఎంపీటీసీ జమండ్ల రాములు, యూత్ అధ్యక్షుడు కొమురన్న, ఎడ్ల లక్ష్మణ్, పదాల సురేందర్, సుధాకర్, వేమిశెట్టు చెందు, అంబాల శ్రీను, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి బిర్రు మదర్, ఎస్సీ సెల్ జిల్లా సభ్యుడు బిర్రు కమల్, బల్లె రవి, వేణు, పదాల శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ శాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న యువనేత దొంతి అవియుక్త్ రెడ్డి

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ**



**నర్సంపేట, 18 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను నర్సంపేట పట్టణంలోని అంగడి మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తనయుడు, యువనేత దొంతి అవియుక్త్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ చేరి ఆడిపాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుంది. తరతరాలుగా వస్తున్న ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని వేడుకల సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు: టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

## మా యంగ్ లుక్ రహస్యం అదే: సైఫ్, కరీనా ఆసక్తికర వ్యాఖ్యలు

**కమెడియన్ కపిల్ శర్మను ప్రశంసించిన కరీనా కపూర్**
**నువ్వో అబ్సొల్యూట్ స్టార్ అంటూ ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్**
**తనకు సైఫ్ మూడుసార్లు ప్రపోజ్ చేశాడన్న బెబో**
**తమ యంగ్ లుక్ సీక్రెట్ దేశీ నెయ్యి అని వెల్లడి**



ప్రముఖ కమెడియన్, నటుడు కపిల్ శర్మపై బాలీవుడ్ నటి కరీనా కపూర్ ప్రశంసల వర్షం కురిపించారు. కపిల్ ఒక 'అబ్సొల్యూట్ స్టార్' అని ఆమె అభివర్ణించారు. శనివారం సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది. ఇటీవల 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ శర్మ షో'లో కరీనా కపూర్ తన భర్త సైఫ్ అలీ ఖాన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ ఎపిసోడ్ షూటింగ్ తర్వాత కపిల్ శర్మ.. కరీనా, సైఫ్ మరియు ఇతర సిబ్బందితో కలిసి దిగిన ఒక సెల్ఫీని తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు. "కరీనా, సైఫ్ మీతో ఇంత సరదాగా ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఈ అద్భుతమైన, సరదా ఎపిసోడ్ కు ధన్యవాదాలు. మీ ఇద్దరికీ నా ప్రేమ" అని ఆయన రాసుకొచ్చారు. కపిల్ పోస్టును కరీనా తన ఖాతాలో రీషేర్ చేస్తూ.. "కపిల్, నువ్వొక అబ్సొల్యూట్ స్టార్. మేము కూడా నిన్ను చాలా ఇష్టపడతాం" అని బదులిచ్చారు. ఈ షోలో సైఫ్, కరీనా తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర రహస్యాలను పంచుకున్నారు. సైఫ్ తనకు ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా మూడు సార్లు ప్రపోజ్ చేశారని కరీనా తెలిపారు. "ఆయన నాకు ముంబైలో ప్రపోజ్ చేశారు, గ్రీస్ లో ప్రపోజ్ చేశారు, పారిస్ లోనూ ప్రపోజ్ చేశారు. పారిస్ లో చెప్పినప్పుడు చివరకు నేను 'యస్' చెప్పాను" అని ఆమె వివరించారు. దీనిపై సైఫ్ తనదైన శైలిలో చమత్కరిస్తూ.. "నువ్వు ముంబైలోనే యస్ చెప్పి ఉంటే, నాకు చాలా డబ్బు ఆదా అయ్యేది" అనడంతో నవ్వులు పూశాయి. పెళ్లయి 14 ఏళ్లు గడిచినా ఇప్పటికీ యవ్వనంగా, తాజాగా కనిపించడానికి గల రహస్యం ఏమిటని అడగ్గా.. దానికి కారణం దేశీ నెయ్యి అని సైఫ్ చెప్పారు. తమ ఇంట్లో నెయ్యి తప్పనిసరిగా ఉంటుందని, తమ పిల్లలు తైమూర్, జెహ్ కూడా రోజూ నెయ్యి తింటారని కరీనా తెలిపారు. దీనికి సైఫ్ ఇంకొంత జోడిస్తూ, "ఆమె నెయ్యి తినడమే కాదు, రాత్రిపూట పాదాలకు కూడా రాసుకుంటుంది" అని చెప్పగా, అది నిజమేనని, అలా చేయడం వల్ల చాలా మేలు జరుగుతుందని కరీనా అంగీకరించారు.

## రష్మిక 100 సార్లు అడిగితేనే పెళ్లి చేసుకున్నా!: విజయ్ దేవరకొండ

**'కాఫీ విత్ కరణ్' షోలో సందడి చేసిన విజయ్-రష్మిక జంట**
**రష్మిక ఏడాది పాటు వెంటపడితే ఓకే చెప్పానన్న విజయ్**
**సంతోషకరమైన వివాహానికి తన మంత్రం చెప్పిన విజయ్**
**షో మధ్యలో అల్లు అర్జున్‌కు ఫోన్ చేసిన విజయ్ దేవరకొండ**



టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి తర్వాత తొలిసారిగా కలిసి ప్రముఖ చాట్ షో 'కాఫీ విత్ కరణ్'లో సందడి చేశారు. ఈ ఫైనల్ సీజన్ రెండో ఎపిసోడ్‌లో పాల్గొన్న ఈ జంట, తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తమ పెళ్లి ప్రపోజల్ వెనుక ఉన్న అసలు కథను వివరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. షోలో హోస్ట్ కరణ్ జోహార్ 'మీకు ప్రపోజల్ ఎలా జరిగింది?' అని అడగ్గా, రష్మిక సిగ్గుతో తలదించుకుంది. దీనిపై విజయ్ దేవరకొండ స్పందిస్తూ, "మనం పెళ్లి చేసుకుందాం అని తనే నన్ను అడిగింది. నేను ఓకే చెప్పేలోపు సుమారు 100 సార్లు అడిగి ఉంటుంది" అని నవ్వుతూ చెప్పారు. విజయ్ మాటలకు కరణ్ ఆశ్చర్యపోగా, రష్మిక కలుగజేసుకుని "నేను ఏడాది పాటు అడుగుతూనే ఉన్నాను" అని అసలు విషయం బయటపెట్టారు. దానికి విజయ్ సరదాగా "నేనేం అంత చెడ్డవాడిని కాదు" అని చెప్పడంతో సెట్‌లో నవ్వులు పూశాయి. ఇదే షోలో రాపిడ్ ఫైర్ సెక్షన్‌లో, 'పుష్ప' సహనటుడు అల్లు అర్జున్, 'యానిమల్' సహనటుడు రణ్‌బీర్ కపూర్‌లలో ఎవరిని ఎంచుకుంటారని కరణ్ అడగ్గా, రష్మిక వెంటనే అల్లు అర్జున్ పేరు చెప్పారు. అలాగే, రష్మిక కాకుండా ఎవరితో ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ బాగుంటుందని విజయ్‌ను ప్రశ్నించగా, రష్మిక వెంటనే 'ఎవరితోనూ లేదు' అని జవాబిచ్చింది. దీనిపై విజయ్ స్పందిస్తూ, "సంతోషకరమైన వివాహానికి నా మంత్రం ఒక్కటే.. భార్య చెప్పిన దానికి ఎప్పుడూ ఓకే అనాలి" అని చమత్కరించారు. షోలోని గేమింగ్ సెగ్మెంట్‌లో విజయ్.. అల్లు అర్జున్‌కు ఫోన్ చేసి కరణ్ తో మాట్లాడించడం మరో విశేషం. కొంతకాలంగా తమ రిలేషన్‌షిప్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, విజయ్-రష్మిక ఈ ఏడాది ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్‌లో సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే.

# పార్టీ మధ్యలో రణ్‌వీర్ ప్యాంట్ కుట్టిన దీపిక!



**బార్సిలోనా మ్యూజిక్ ఫెస్టివల్‌లో ఆసక్తికర ఘటన**
**డ్యాన్స్ చేస్తూ చిరిగిపోయిన రణ్‌వీర్ ప్యాంట్**
**బ్యాగ్‌లోని సూది, దారంతో కుట్టిన దీపిక**
**కపిల్ శర్మ షోలో ఘటనను గుర్తుచేసుకున్న నటి**

బాలీవుడ్ స్టార్ జంట దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్‌ల వ్యక్తిగత జీవితంలోని ఓ సరదా సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. గతంలో 'ది కపిల్ శర్మ షో'లో పాల్గొన్న సందర్భంగా దీపిక ఈ ఘటనను వెల్లడించారు. బార్సిలోనాలో జరిగిన ఓ మ్యూజిక్ ఫెస్టివల్‌కు వెళ్లిన సమయంలో రణ్‌వీర్ వదులుగా ఉండే ప్యాంట్ ధరించి ఉత్సాహంగా డ్యాన్స్ చేశారని, ఆ క్రమంలో ప్యాంట్ చిరిగిపోయిందని ఆమె తెలిపారు. వెంటనే తన బ్యాగ్‌లో ఉన్న సూది, దారం తీసి, చుట్టూ అందరూ డ్యాన్స్ చేస్తుండగానే రణ్‌వీర్ ప్యాంట్‌ను కుట్టినట్లు గుర్తుచేసుకున్నారు. ఈ సంఘటనతో అక్కడి వాతావరణం మరింత సరదాగా మారిందని వివరించారు. 2018లో ఇటలీలో సంప్రదాయ కొంకణి పద్ధతిలో, అనంతరం ఆనంద్ కరాజ్ విధానంలో వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. 2024 సెప్టెంబర్ 8న వీరికి కుమార్తె దువా జన్మించింది. 2026 సెప్టెంబర్ 19న రెండో కుమార్తెకు జన్మనివ్వడంతో ఈ జంట మరోసారి తల్లిదండ్రులయ్యారు. 'గోలియోన్ కి రాస్‌లీలా రామ్‌లీలా', 'బాజీరావ్ మస్తానీ', 'పద్మావత్', '83' వంటి చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట తమ అనుబంధంతో అభిమానులను ఆకట్టుకుంటోంది.

# 3 రోజుల్లో రూ.300 కోట్లు.. బాక్సాఫీసు వద్ద 'జైలర్-2' మేనియా

**తొలి వారాంతంలోనే రెండుసార్లు వంద కోట్ల మార్కును అందుకున్న వసూళ్లు**
**విదేశాల్లో మూడు రోజుల్లోనే రూ. 155 కోట్ల భారీ గ్రాస్ కలెక్షన్స్**
**నాలుగు రోజుల వీకెండ్‌కు రూ. 420 కోట్లకు పైగా రాబట్టే అవకాశం**
**హిందీలోనూ భారీ మల్టీప్లెక్స్‌లు లేకుండానే మంచి వసూళ్లు**

సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో నిరూపిస్తున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'జైలర్ 2' చిత్రం విడుదలైన కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి మూడు రోజుల్లోనే రూ. 300 కోట్ల మైలురాయిని దాటి సరికొత్త రికార్డులు నెలకొల్పింది. విడుదలైన మొదటి రోజు నుంచే 'జైలర్ 2' హవా స్పష్టంగా కనిపించింది. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 125 కోట్ల గ్రాస్ వసూలు చేసిన ఈ చిత్రం, రెండో రోజు రూ. 85 కోట్లు రాబట్టింది. ఇక మూడో రోజు శనివారం నాడు వసూళ్లు మళ్లీ పుంజుకొని ఏకంగా రూ. 108 కోట్లకు చేరాయి. దీంతో మూడు రోజుల్లో మొత్తం గ్రాస్ రూ. 318 కోట్లకు చేరినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. తొలి వారాంతంలోనే రెండుసార్లు ఒకే రోజులో రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ సాధించడం రజనీకాంత్ సినిమాకే చెల్లిందని విశ్లేషకులు చెబుతున్నారు. భారత్‌లోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'జైలర్ 2' అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. ప్రీమియర్‌లతో కలిపి కేవలం మూడు రోజుల్లోనే విదేశీ మార్కెట్ల నుంచి ఈ సినిమా రూ. 155 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇది భారతీయ సినిమాకు అపూర్వమైన విజయంగా పరిగణిస్తున్నారు. ప్రస్తుత ట్రెండ్ చూస్తుంటే, ఆదివారం కూడా ఈ చిత్రం రూ. 100 కోట్ల మార్కును దాటే అవకాశం ఉందని, దీంతో నాలుగు రోజుల లాంగ్ వీకెండ్ ముగిసేసరికి ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు రూ. 420 కోట్లు దాటవచ్చని అంచనా వేస్తున్నారు. హిందీ బెల్ట్‌లోనూ పీవీఆర్ ఐనాక్స్, సినీపొలిస్, మిరాజ్ వంటి ప్రధాన మల్టీప్లెక్స్ చైన్‌లలో విడుదల కానప్పటికీ, మూడు రోజుల్లో రూ. 10.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించడం విశేషం. ఈ గణాంకాలు చూస్తుంటే, 'జైలర్ 2' మెగా బ్లాక్‌బస్టర్‌గా నిలవడం ఖాయమని స్పష్టమవుతోంది.

